

చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 644 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



మీ ఇంటి ఆడబిడ్డలం.. ఆదరించండి

మీ ఇంటి ఆడబిడ్డలం. ఆదరించండి. ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం' అంటూ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ అన్నారు.

8లో



జిల్లావ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

48 గంటల ముందే మద్యం బంద్

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరిగే 13వ తేదీకి 48 గంటల ముందే జిల్లాలోని మద్యం దుకాణాలు మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందన్నారు. జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, మూసివేయాలన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ నెల 4వ తేదీ కూడా మద్యం దుకాణాలు మూసి వేయాలన్నారు.

టీడీపీ రౌడీ మూకల దౌర్జన్యం

- వైఎస్సార్ సీపీ ప్రచార వాహనం ధ్వంసం



టీడీపీ మూకలు ధ్వంసం చేసిన వాహనం

తనకల్లు: ఎన్నికల వేళ టీడీపీ రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులే లక్ష్యంగా దాడులు చేయడంతో పాటు ప్రచార వాహనాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మండల పరిధిలోని ఈతోడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇందుకోసం కదిరి నుంచి వైఎస్సార్ సీపీకి చెందిన ప్రచార వాహనాన్ని రప్పించారు. జగన్ పాటలు మార్మోగడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. జనం కూడా నృత్యాలు చేస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. దీన్ని చూసి ఓర్వలేని పచ్చమూక రెచ్చిపోయింది. ప్రచార కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రచార వాహనం కదిరికి వెళ్తుండగా..కోటూరు సమీపంలో అడ్డుకున్నారు. డ్రైవర్‌ను చితకబాదగా, అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనానికి ఏర్పాటు చేసిన కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు చెందిన ఫ్లెక్సీలను చించివేశారు. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఎస్‌ఐ ధరణిబాబుకు ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాసంతి @ ఐఎఫ్ఎస్

- యూపీఎస్సీ పరీక్షల్లో సత్తా చాటిన పంచాయతీ కార్యదర్శి
- ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఎంపిక

ఆమె ఓ పంచాయతీ కార్యదర్శి.. కానీ తన కలను నెరవేర్చుకునేందుకు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారు. శిక్షణ తీసుకోకుండానే సత్తా చాటారు. జాతీయ స్థాయిలో 50వ ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు ఎంపికయ్యారు.




వాసంతి (ఫైల్)

సోమందేపల్లి: మండలంలోని నాగినయని చెరువు పంచాయతీ కార్యదర్శి వాసంతి యూపీఎస్సీలో సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. వాసంతి స్వగ్రామం గోరంట్ల మండలం గౌనివారిపల్లి కాగా, తండ్రి గోవిందరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పెనుకొండ మండలంలో పనిచేస్తున్నారు. 2019లో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన వాసంతి.. వివిధ మండలాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే ప్రజలకు మరింత సేవలందించేందుకు యూపీఎస్సీ ఒక్కటే మార్గమనుకున్నారు. 2023లో జరిగిన యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. రాత పరీక్ష అనంతరం ఇంటర్వ్యూ కూడా పూర్తి చేశారు. ఫలితాల కోసం ఆశగా ఎదురుచూస్తుండగా...బుధవారం ఆమె కల నెరవేరింది. ఫలితాల్లో ఆమె జాతీయ స్థాయిలో 50వ ర్యాంకు దక్కించుకుని ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. దీంతో కుటుంబీకులు, బంధువులు, తోటి ఉద్యోగులు వాసంతిని అభినందనలతో ముంచెత్తారు.

పార్థ.. అవినీతి మేత

అయనది మూడు దశాబ్దాల రాజకీయ జీవితం..అంతా అక్రమాల కలబోతే. అవినీతి మేతే. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రకృతి వనరులను కొల్లగొట్టారు. రూ.కోట్లు మేసేశారు. 'కియా' ఏర్పాటు సమయంలో రైతులను నిండా ముంచేశారు. మైనింగ్, ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరి పోయారు. ఎమ్మెల్యేగా వెలగబెట్టినప్పుడే జనాన్ని నిండాముంచిన ఆ టీడీపీ నేత ఇప్పుడు ఏకంగా పార్లమెంట్‌కే పోటీ చేస్తున్నారు.



- టీడీపీ హయాంలో ఊరూరా అక్రమాలు
- పెనుకొండ పరిధిలో భారీ భూదందా
- నీరు–చెట్టు, మరుగుదొడ్ల బిల్లుల స్వాహా
- రూ.వందల కోట్ల ఇసుక దోపిడీ
- 'కియా' ఏర్పాటు సమయంలో రైతులకు టోకరా
- బీకే అండతో అల్లుడు శశిభూషణ్ అక్రమాలెన్నో
- వ్యతిరేకించిన పెనుకొండ వాసులు
- ఈసారి ఎంపీ సీటిచ్చిన చంద్రబాబు

సాక్షి, పుట్టపర్తి

బీకే పార్థసారథి.. టీడీపీలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. అవినీతి, అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడు. రౌడీలు, మద్యం అక్రమ రవాణా దారులు, మైనింగ్ మాఫియా వ్యక్తులను అనుచరులుగా చేర్చుకుని అడ్డదిడ్డంగా సంపాదించాడు. 'కియా' కార్ల పరిశ్రమ రాకతో ఎంతోమంది రైతులను మోసం చేశాడు. తక్కువ ధరలకే భూములు కాజేశాడు. కొందరికి పరిహారం ఇవ్వకుండా బెదిరించి లాక్కున్నాడు. గత టీడీపీ హయాంలో ఐదేళ్ల పాటు పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా భారీ దోపిడీ చేశాడు. అల్లుడిని రంగంలోకి దింపి రూ.కోట్లు వసూళ్లు చేశారనే ఆరోపణలున్నాయి. అందుకే 2019 ఎన్నికల్లో పెనుకొండ ప్రజలు బీకేను ఘోరంగా ఓడించారు.

కమీషన్ల కక్కుర్తి..

'కియా కార్ల పరిశ్రమ కోసం భూ సేకరణ, చదును పనుల్లో పార్థసారథి బాగా నొక్కేశాడు. ఎకరా భూమికి రైతుకు రూ.10.5 లక్షలు ఇస్తే.. భూమిని చదును చేయడానికి ఎకరాకు రూ.25 లక్షలు ఖర్చు చూపి.. కమీషన్లు తీసుకుని చంద్రబాబు.. లోకేశ్‌కు వాటా ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఇక సోమందేపల్లి సమీపంలోని పెద్దకొండ చాలా మహిమాన్వితమైందని స్థానికులు భావిస్తారు. అందుకే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరు. కానీ ఆ కొండకు అవతలి వైపు ఉన్న క్వారీలకు వెళ్లేందుకు బీకే పార్థసారథి పెద్దకొండపైనే రోడ్డు వేయించాడు. ఇందుకు గానూ క్వారీ నిర్వాహకులతో.. రూ.కోట్లు దండుకున్నాడనే ఆరోపణలున్నాయి.

రైతుల పాలిట యముడిలా..

'కియా' కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇప్పించకుండా.. బీకే సైంధవుడిలా అడ్డుపడ్డారు. గుట్టూరుకు చెందిన రైతు వడ్డే సుబ్బరాయుడు మరణానికి కారణమయ్యాడు. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని 'కియా' సమీపంలో రూ.కోట్లు విలువ చేసే భూములను అక్రమంగా కొనుగోలు చేశారని, ఎందరో రైతులను మోసం చేశాడని వెంకటగిరిపాళ్యంకు చెందిన రైతులు పార్థసారథిపై పలుమార్లు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

తప్పులెన్ని చేసినా..

సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి వద్ద పార్థసారథి అల్లుడు శశిభూషణ్.. తన క్వారీలో ఓ కూలీపై కాల్పులు జరిపి ప్రాణాలు తీశాడు. అయితే టీడీపీ పెద్దల సహకారంలో కేసు లేకుండా తప్పించుకున్నాడనే ఆరోపణలున్నాయి. బీకే పార్థసారథి అనుచరుడిగా ఎదిగిన సిద్దయ్య చీప్ లిక్కర్ వ్యాపారం చేస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. అయినా నిత్యం సిద్దయ్యను వెంట పెట్టుకుని పార్థసారథి పర్యటిస్తుంటారు. అలాగే బీకే వెంట నడిచే మరో మహిళ నేత కూడా నాటు సారా వ్యాపారం చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

ఎస్సీల భూముల్లో క్వారీ

టీడీపీ హయాంలో రొద్దం మండలం కంబాలపల్లి, శ్యాపురం గ్రామాల శివార్లలో బీకే క్వారీ నడిపేవాడు. ఇందుకు కొండ సమీపంలోని 16 మంది ఎస్సీ రైతులకు సంబంధించిన 40 ఎకరాల భూములను కాజేశాడు. ఏడాదికి ఎకరాకు రూ.4 వేలు ఇస్తానని నమ్మబలికాడు. లీజుకు ఇవ్వకుంటే లాగేసుకుంటామని బెదిరించాడు. చివరకు ఆ రైతుల భూములు సొంతం చేసుకున్నాడు.

అల్లుడికి ఆరు శాతం కమీషన్లు..

బీకే చేసే అక్రమార్జనలో ఆరు శాతం తన అల్లుడు శశిభూషణ్‌కు ఇస్తారు. గత టీడీపీ హయాంలో నుంచి ఈ దందా కొనసాగుతోంది. అందుకే అప్పట్లో నియోజకవర్గంలో ఏ పనులు చేయాలన్నా ముందు కమీషన్లు ఇవ్వాల్సి వచ్చేది. ఈ దందా తట్టుకోలేక కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చేవారు కాదు. దీంతో పెనుకొండ అభివృద్ధి కుంటుపడింది.

ప్రజాధనం లూటీ..

టీడీపీ హయాంలో 'స్వచ్ఛభారత్' పథకం కింద పెనుకొండకు భారీగా మరుగుదొడ్లు మంజూరయ్యాయి. అయితే మరుగుదొడ్లు నిర్మించకుండానే బీకే పార్థసారథి బిల్లులు స్వాహా చేశాడు. అర్హులకు పథకం అందకుండా.. స్వచ్ఛభారత్ పథకానికి అప్పట్లోనే స్వస్తి పలికాడు. 'నీరు-చెట్టు' పథకంలో రూ.కోట్లు కొల్లగొట్టాడు. దీంతో ఆ తర్వాత ఎన్నికల్లో ప్రజలు బీకేను ఘోరంగా ఓడించారు.

రూ.వందల కోట్ల ఇసుక మేత..

టీడీపీ హయాంలో పెనుకొండ పరిధిలోని పెన్నా, జయమంగళి, చిత్రావతి నది పరీవాహక ప్రాంతాలను బీకే పార్థసారథి చెర బట్టారు. రోజూ వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక తోడేశాడు. ఐదేళ్లలో ఇసుక అక్రమ రవాణా ద్వారానే రూ.500 కోట్లపైనే సంపాదించాడని టీడీపీ నేతలే చెబుతున్నారు.

టీడీపీకి కొమ్ముకాస్తున్న డీఎస్పీ

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారు
- డీఎస్పీ, ఆర్డీఓపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశా
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో కదిరి డీఎస్పీ శ్రీలత, ఆర్డీఓ వంశీకృష్ణ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూపురం పార్లమెంట్ పార్టీ ఎన్నికల పరిశీలకుడు వజ్ర భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ జనరల్ ఏజెంట్‌గా ఉన్న తాను పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలోకి వెళ్లగా... డీఎస్పీ, ఆర్డీఓ అవమాన పరిచే ధోరణిలో మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తనను మాత్రమే పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపించాలని డీఎస్పీ శ్రీలత, ఆర్డీఓ పోలీసులకు ఆదేశించారన్నారు. పోలీసులు తనను చుట్టిముట్టి భయాందోళనకు గురి చేశారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. డీఎస్పీ శ్రీలత ఒక పార్టీకి కొమ్ముకాస్తూ వ్యవహరించారన్నారు. అర్హత, బాధ్యత లేని టీడీపీకి చెందిన కార్యకర్తలు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉండేందుకు అనుమతి ఇచ్చిన డీఎస్పీ, ఎన్నికల కమిషన్ గుర్తించిన రాజకీయ పార్టీ జనరల్ ఏజెంట్‌గా ఉన్న తనను బయటకు వెళ్లిపోవాలని చెప్పడం పక్షపాత ధోరణికి అద్దం పడుతోందన్నారు. అలాగే అక్కడే ఉన్న టీడీపీ నేతలకు మద్దతుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనుకుంటున్న టీడీపీ నేతలకు అధికారులు ఇలా అండగా నిలవడం నిజంగా దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వారు అపహాస్యం చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన గురించి వివరిస్తూ డీఎస్పీ శ్రీలత, ఆర్డీఓ వంశీకృష్ణపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని ఆయన వెల్లడించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఒక పార్టీకి కొమ్ముకాయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు పక్షపాత ధోరణి మానుకోవాలన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- ఎన్నికల సాధారణ పరిశీలకులు అన్బు కుమార్
- పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి: కలెక్టర్



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు అన్బుకుమార్

పుట్టపర్తి అర్బన్: పోలింగ్ పారదర్శకంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు అన్బుకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి ఆరామంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ రోజున ఓటింగ్ ప్రక్రియ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలన్నారు. ఓటరు మినహా ఇతరులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి వీల్లేదన్నారు. ఈ ప్రక్రియ అంతా మైక్రో అబ్జర్వర్లు గమనిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే వెంటనే ఆర్‌ఓలకు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన సూచనలను పక్కాగా అమలు చేయాలన్నారు. పోలింగ్ పూర్తి కాగానే సీల్ వేసి అబ్జర్వర్ల రిపోర్టు పూర్తి చేయాలన్నారు. మే 12వ తేదీన పోలింగ్ సామగ్రి పంపిణీ ఉంటుందని, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చిత్రీకరణ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా నిరంతర నిఘాతో పాటు పోలింగ్ సరళిపై కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకువెళ్లకూడదన్నారు. అలాగే సెల్ఫీలు నిషేధమన్నారు. వీటన్నింటినీ మైక్రో అబ్జర్వర్లు గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ వరకూ మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కల్పించారు.

సందేహాలన్నీ నివృత్తి చేసుకోండి..

జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఎలాంటి సందేహాలున్నా శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు ఓటింగ్‌కు ముందు కనీసం 90 నిమిషాల ముందే కేంద్రంలో ఉండాలన్నారు. ముఖ్యమైన అంశాలను అనుబంధం -1లో ఇచ్చిన ఫార్మాట్‌లో క్రమం తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్లను సరిగ్గా గుర్తించడం, చనిపోయిన ఓటరు జాబితా గుర్తింపు తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆయన మైక్రో అబ్జర్వర్ల పోస్టల్ బ్యాలెట్ వేసే సాయి ఆరామంలోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



పాల్గొన్న మైక్రో అబ్జర్వర్లు

నేడు జననేత జగన్ రాక





సిద్ధమైన హెలిప్యాడ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్టీ నేతలు

- మధ్యాహ్నం 1.30 గంటలకు కళ్యాణదుర్గం సభకు హాజరు
- తరలిరానున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- భారీ ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి, అనంతపురం: గత ఐదేళ్లు సంక్షేమాభివృద్ధిని పరుగులు పెట్టించి, అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ పొందిన జననేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం కళ్యాణదుర్గం రానున్నారు. కర్నూలు జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సభాస్థలికి 1.30 గంటలకు చేరుకుని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించనున్నారు. పోలింగ్‌కు నాలుగు రోజులు గడువు ఉండటం, కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తలారి రంగయ్యను ప్రకటించిన తర్వాత తొలిసారిగా ఇక్కడికి సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారానికి వస్తుండటంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాభివృద్ధి

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధి జరిగింది. కళ్యాణదుర్గంలో అయితే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. మరోవైపు అభివృద్ధి పనులు అంతే స్థాయిలో జరిగాయి. రైతు భరోసా, అమ్మ ఒడి, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, ఈబీసీ నేస్తం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ, రైతులకు సున్నావడ్డీ తదితర పథకాల ద్వారా ఐదేళ్లలో రూ. నాలుగు వేల కోట్లకు పైగా లబ్ధి చేకూర్చి 'దుర్గం' ప్రజల హృదయాల్లో సీఎం జగన్ చెరగని ముద్ర వేసుకున్నారు.

తరలిరానున్న శ్రేణులు

పథకాలతో తమను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ఇప్పటికే కళ్యాణదుర్గం ప్రజలు సిద్ధమైపోయారు. సీఎం ప్రసంగాన్ని వినేందుకు నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం,కుందుర్పి,కళ్యాణదుర్గం, శెట్టూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరానున్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

తరలి రండి..

సీఎం బహిరంగ సభ కోసం వైఎస్సార్ సీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ నేతలు ఉమా మహేశ్వర నాయుడు, కలేకుర్తి జయరామిరెడ్డి, రామకృష్ణ బహిరంగ సభ ఏర్పాట్లు, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం తలారి రంగయ్య మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నేతలు, ప్రజలు తరలివచ్చి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దండించాల్సిన వారే దారి తప్పారు!

- పోస్టల్ బ్యాలెట్‌లో దొంగ ఓట్లకు ప్రయత్నం
- సహ టీచర్ల ఫిర్యాదుతో దొరికిపోయిన బుక్కపట్నం మండల టీచర్
- ధర్మవరం ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏపీటీఎఫ్ నేత కోనంకి హల్‌చల్

పుట్టపర్తి అర్బన్: ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వారు..జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించే వారు...దారి తప్పిన వారిని దండించి భావి భారతాన్ని తయారు చేసే వారు ఉపాధ్యాయులు. అందుకే ఏ ఎన్నికలు జరిగినా పోలింగ్ నిర్వహణ వారికే అప్పగిస్తారు. ఇంతటి గురుతరమైన బాధ్యతల్లో ఉన్నవారిలో కొందరు దారి తప్పారు. ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ ఉపాధ్యాయలోకానికే మచ్చతెచ్చారు.

- బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లికి చెందిన అంజన్‌మూర్తి అనే ఉపాధ్యాయుడు పుట్టపర్తి ఫెసిలిటేషన్ కేంద్రంలో 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ వేశారు. అయితే 8వ తేదీ బుధవారం మళ్లీ అదే కేంద్రానికి వచ్చి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించారు. దీంతో తోటి ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయగా పోలీసులు, ఎన్నికల సిబ్బంది వారించారు. అయితే అంజన్‌మూర్తి వారిపై తిరగబడి విధులకు ఆటంకం కలిగించి పెద్ద డ్రామాకు తెరలేపాడు. దీంతో అక్కడే ఉన్న పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
- ఇక ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ మంగళవారం ధర్మవరంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. బుధవారం ఫెసిలిటేషన్ కేంద్రానికి వచ్చారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కేంద్రంలోకి వెళ్లి హల్ చల్ చేశారు. ఓటర్లను ప్రభావితం చేస్తూ బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని ఉపాధ్యాయులను ప్రభావితం చేశారు. దీంతో కోనంకి అశోక్‌కుమార్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కోరారు.



ధర్మవరంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేస్తున్న కోనంకి అశోక్‌కుమార్

నేటితో పోస్టల్ బ్యాలెట్‌కు ఆఖరు..

పోస్టల్ బ్యాలెట్ గురువారంతో ముగియనుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ నెల 4, 7, 8 తేదీల్లో వేలాది మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇక పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ఎస్పీ కార్యాలయం, ఎసెన్షియల్ సర్వీస్ అధికారులు, సిబ్బంది కోసం పుట్టపర్తిలోని బీసీ బాలుర హాస్టల్, మైక్రో అబ్జర్వర్ల కోసం పుట్టపర్తి సాయి ఆరామంలో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం 6,370 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా 29,978 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.



పుట్టపర్తి కేంద్రంలో హెల్ప్ డెస్క్ సాయంతో ఫారంలు నింపుకుంటున్న ఉద్యోగులు

- పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కొనసాగింది. దరఖాస్తు చేసుకున్న 423 మంది హోంగార్డులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,211 మంది పోలీసులు, హోంగార్డులు పోస్టల్ బ్యాలెట్లకు దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం తెలిపింది.



పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకుంటున్న పోలీస్ సిబ్బంది

క్లుప్తంగా

టీడీపీ ప్రచారంలో యానిమేటర్



పరిటాల జ్ఞానతో పాటు ప్రచారంలో పాల్గొన్న ప్రమీల (వృత్తంలో)

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రామగిరి మండలం పేరూరు యానిమేటర్ ప్రమీల టీడీపీ ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. మాజీ మంత్రి పరిటాల సునీత కోడలు పరిటాల జ్ఞాన నాలుగు రోజుల క్రితం పేరూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యానిమేటర్ ప్రమీల పాల్గొని టీడీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేశారు. అనంతరం పరిటాల సునీతతో కలసి ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది.

ఇరువురిపై కేసు నమోదు

గుంతకల్లు: పోస్టల్ బ్యాలెట్ ఓటును బహిర్గతం చేసిన ఇద్దరు ఉద్యోగులపై కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్‌ఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం గుంతకల్లు సబ్ డివిజన్ పరిధిలో పోలీసు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. ఆ సమయంలో ఓ ఉద్యోగి అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఓటు వేసిన తర్వాత బ్యాలెట్‌ను (పింక్ పేపర్) తమ సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి, తాము ఓటు హక్కు వినియోగించుకున్నామని, మీరు కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ స్నేహితులకు షేర్ చేశాడు. దీనిని మరో ఉద్యోగి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి తీవ్రంగా పరిగణిస్తూ సమగ్ర విచారణకు ఆర్‌ఓను ఆదేశించారు. విచారణ అనంతరం ఇద్దరు ఉద్యోగులపై పోలీసులకు ఆర్‌ఓ శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

ఉరవకొండ: విడపనకల్లు మండలం వి.కొత్తకోట గ్రామ శివారులో అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న ఇద్దరిని సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. వి.కొత్తకోట శివారులో బుధవారం ఉదయం రూట్ వాచ్ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై విడపనకల్లుకు చెందిన సప్తగిరి, వెంకటేసు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి 2,016 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆశీర్వదించండి... అండగా ఉంటాం

ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఊరూవాడ ఏకం చేస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందుకు దూసుకెళుతున్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి, ప్రాంతాల అభివృద్ధిపై ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. 'మీ అందరి అశీర్వాదంతో మరోసారి అధికారంలోకి రాగానే' అంటూ రాబోవు ఐదేళ్లలో తామేమి చేయగలమో దానిని మాత్రమే వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. మంచి చేసిన నాయకుడిని మళ్లీ సీఎంగా చేసుకుందామంటూ పిలుపునిస్తున్నారు.

– సాక్షి బృందం:



ఓడీచెరువులో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్డు షోకు హాజరైన జన సందోహం



ధర్మవరంలోని 33వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



హిందూపురం వాల్మీకి సర్కిల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి దీపిక, నవీన్ నిశ్చల్



కదిరి మండలం పట్నంలో గుర్రంపై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బీఎస్ మక్బూల్







గోరంట్ల మండలం పాలసముద్రంలో రోడ్డుషో నిర్వహిస్తున్న అభ్యర్థి ఉషశ్రీ చరణ్, అమరాపురం మండలం గౌడనకుంటలో ఈరలక్కప్ప రోడ్డు షోలో మహిళల ఉత్సాహం, ఆత్మకూరు మండలం మదిగుబ్బలో జనసందోహంతో కిక్కిరిసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రోడ్డు షో

యువకుడి దుర్మరణం

చిలమత్తూరు: స్థానిక థామస్‌మన్రో తోపు సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన నరేష్ (25) బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కొడికొండ చెక్‌పోస్టు వైపుగా వెళుతుండగా కోడూరు థామస్‌మన్రో తోపు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన నరేష్... తల ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకు దూసుకెళ్లాడు. ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

27 మండలాల్లో వర్షం

- తొలకరికి ముందే వాన జల్లులకు సేద తీరిన జనం



అనంతపురం అగ్రికల్చర్: వరుణుడు కరుణించడంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 27 మండలాల పరిధిలో 14.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. మండే ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న జిల్లా వాసులు వాన చినుకుల మధ్య సేద తీరారు. గుత్తి 47.2 మి.మీ, బ్రహ్మసముద్రం 42.2 మి.మీ, యాడికి 40 మి.మీ, ఆత్మకూరు 30 మి.మీ, శెట్టూరు 28.4 మి.మీ, వజ్రకరూరు 24.2 మి.మీ, పామిడి 22.2 మి.మీ మేర పదును వర్షం కురిసింది. రాప్తాడు 18.2 మి.మీ, కూడేరు 17.2 మి.మీ, అనంతపురం 16.8 మ ఇ.మీ, తాడిపత్రి 16.4 మి.మీ, శింగనమల 16.2 మి.మీ, నార్పల 14.2 మి.మీ, బుక్కరాయసముద్రం 14.2 మి.మీ, పెద్దపప్పూరు 13.8 మి.మీ, గుమ్మగట్ట 12.4 మి.మీ, గార్లదిన్నె 11.2 మి.మీ మేర మోస్తరుగా వర్షపాతం నమోదైంది. మరికొన్ని మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, కుందుర్పి మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 29 మండలాల పరిధిలో 9.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమందేపల్లి 36 మి.మీ, లేపాక్షి 24.6 మి.మీ, పరిగి 24.2 మి.మీ, తనకల్లు 24 మి.మీ, అమరాపురం 19.4 మి.మీ, అమడగూరు 18.4 మి.మీ, చిలమత్తూరు 15.8 మి.మీ, గుడిబండ 12.4 మి.మీ, రామగిరి 12.2 మి.మీ, బత్తలపల్లి 11.8 మి.మీ, పెనుకొండ 10.8 మి.మీ మేర వర్షం కురిసింది. మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదైంది. తొలకరికి ముందే జల్లులు పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తుండగా వేసవితాపం నుంచి జనానికి కాస్తంత ఉపశమనం లభించింది.

'అనంతపురం' డీఐజీగా డాక్టర్ షేముషి



అనంతపురం: అనంతపురం రేంజ్ డీఐజీగా డాక్టర్ షేముషి నియమితులయ్యారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె 2008 బ్యాచ్ ఆంధ్రా కేడర్ ఐపీఎస్ అధికారిణి. డీఐజీగా బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు రిపోర్టు చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.

పాలిసెట్‌లో ప్రతిభ

- షణ్ముఖ శర్మకు జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు







వై.షణ్ముఖ శర్మ, వి.రోహిత్ సాయి వర్మ, బి. సాహితీ

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్–2024 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 7,819 మంది అభ్యర్థులకు గాను, 6,759 (86 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4,628 మందికి గాను 3,932 మంది, బాలికలు 3,191 మందికి గాను, 2,827 మంది ఉత్తీర్ణత మార్కులు సాధించారు. వై. షణ్ముఖ శర్మ రాష్ట్రస్థాయిలో 51వ ర్యాంకు (జిల్లా స్థాయిలో ఒకటో ర్యాంకు), వి. రోహిత్ సాయివర్మ 59వ ర్యాంకు (జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు), బి. సాహితీ 160వ ర్యాంకు (జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు) దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, పాలిసెట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామకృష్ణా రెడ్డి అభినందించారు.

అశ్వవాహనంపై శ్రీవారు



అశ్వవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం అశ్వవాహనంపై భక్తులకు దర్శనంఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవిందనామస్మరంతో మార్మోగింది. శ్రీనివాసుడికి వేదమంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు మహామంగళహారతి, తదితర పూజలు చేశారు. అనంతరం శ్రీనివాసుడిని అశ్వవాహనంపై కొలువుదీర్చి ఆలయం నుంచి ప్రధాన రహదారిపై ఊరేగించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

అమరాపురం: మండలంలోని నగోనపల్లికి చెందిన జయమ్మ (61) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. బుధవారం ఉదయం దుస్తులు ఉతికి ఇంటి ఆవరణలోని రేకుల షెడ్ వద్ద ఆరవేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి షెడ్ మీదుగా ఉన్న విద్యుత్ తీగల నుంచి కరెంట్ ప్రసరిస్తున్నట్లుగా గుర్తించారు. మృతురాలి కుమారుడు నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ. జనార్దననాయుడు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతుడు గోపాలరెడ్డి

యల్లనూరు: మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన రైతు రాగిపిండి గోపాలరెడ్డి (48) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన విద్యుత్ మోటార్ స్టార్ట్ చేస్తున్న క్రమంలో తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గిరిబాబు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య గంగాభవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువ రైతు...



మనోహర్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువరైతు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన మనోహర్ (32) టమాట పంట సాగు చేపట్టాడు. బుధవారం ఉదయం పంటను చూసేందుకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య మాలతి, రెండేళ్ల వయసున్న కుమారుడు, 8 నెలల వయసున్న కుమార్తె ఉన్నారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు కళ్యాణదుర్గంలోని ఆస్పత్రికి చేరుకుని మనోహర్ మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. ఘటనపై కుటుంబసభ్యులతో ఆరా తీసి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి

తాడిపత్రి రూరల్: ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పని చేసిన చంద్రబాబు.. సీమ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మండిపడ్డారు. తాడిపత్రిలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని ఈ ఐదేళ్ల పాలనలో నిరూపితమైందన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతునిస్తున్నామన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణను అడ్డుకోవడం ద్వారా రాయలసీమ ద్రోహిగా మిగిలిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రజలకు వరమన్నారు. భూ వివాదాలకు తావు ఉండదన్నారు. సమావేశంలో నాయకులు భాస్కరరెడ్డి, రంగనాయకులు,, రామ్మోహన్ రెడ్డి, నూర్ మహమ్మద్, ప్రతాపరెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి ఆడబిడ్డలం.. ఆదరించండి





సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి దీపిక, పక్కన ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఆత్మీయ సమావేశానికి హాజరైన కురుబలు

- పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి బాలకృష్ణ చేసిందేమీ లేదు
- ఒక్క అవకాశమివ్వండి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం
- కురుబల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు టీఎస్ దీపిక, బోయ శాంతమ్మ

హిందూపురం: 'మీ ఇంటి ఆడబిడ్డలం మేము. ఆదరించి ఆశీర్వదించండి. ఒక్క అవకాశమిస్తే నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం. మీ అందరిలోనూ ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటాం' అంటూ హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్ దీపిక, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. హిందూపురంలోని పాండురంగనగర్‌లో ఉన్న భక్త కనకదాసు కల్యాణ మంటపంలో బుధవారం ఉదయం కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా కురుబ సంఘం నాయకుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి దీపిక, బోయ శాంతమ్మ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కురుబల ఆరాధ్య దైవమైన కనకదాసు చిత్ర పటం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ప్రసంగించారు. హిందూపురం నియోజకవర్గంలో 1978లో ఎమ్మెల్యేగా కురుబ తిప్పేస్వామి పనిచేశారని ఆ తర్వాత ఇన్నేళ్లకు బీసీలకు అవకాశం దక్కిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వాదంతో మీ ఇంటి ఆడబిడ్డలుగా బరిలో దిగిన తమను ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

మీలో ఒక్కరిగా ఉంటాం..

నమ్మి టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తే అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గ ముఖం కూడా ఎమ్మెల్యే బాలకృష్ణ చూడలేదని విమర్శించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి బాలయ్య చేసిన చెప్పుకోదగ్గ ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా లేదన్నారు. స్థానికేతరుడైన బాలయ్య ఏనాడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారన్నారు. స్థానికులమైన తమకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజల మధ్యలోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ రేపటి హిందూపురం అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలని పిలుపునిచ్చారు. తాము గెలిచిన తర్వాత సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని భరోసానిచ్చారు.

నాలుగు దశాబ్దాల అణచివేతకు చరమగీతం పాడండి

హిందూపురంలో 40 ఏళ్లుగా టీడీపీకి చెందిన వారినే గెలిపిస్తూ వచ్చారని, ఈ ఒక్కసారి తమపై నమ్మకంతో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని దీపిక, బోయ శాంతమ్మ అన్నారు. నాలుగు దశాబ్దాల అణచివేతకు చరమగీతం పాడేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో కురుబ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ముదిరెడ్డిపల్లి కురుబ సంఘం అధ్యక్షుడు శంకరప్ప, కౌన్సిలర్లు శివ, లక్ష్మీమహేష్ గౌడ్, నాయకులు కురుబ అనిల్, సుబ్బు, భారతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాలీవానకు కూలిన రేషం షెడ్డు

- రూ. 4 లక్షల నష్టం



మరువపల్లిలో గాలీవానకు కూలిన రేషం షెడ్డును చూపుతున్న బాధిత రైతు

రొద్దం: మండల పరిధిలోని కే మరువపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గాలీవాన దెబ్బకు రైతు చాకిల ముత్యాలప్ప అనే రైతుకు చెందిన రేషం షెడ్డు కూలిపోయింది. గాలి భారీగా వీచడంతో ఒక్కసారిగా షెడ్డు కూలి పోయినట్లు బాధిత రైతు వాపోయారు. తమ కుటుంబం మొత్తం అందులోనే ఉన్నట్లు వివరించారు. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డామన్నారు. రూ. 1 లక్షల విలువ చేసే రేషం పురుగులు, రేషం షెడ్డు కూలి రూ. 3 లక్షలు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.

శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించండి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఆమె 1వార్డు సాయినగర్‌లో స్థానిక నాయకులు, మహిళలతో కలసి ప్రచారం నిర్వహించారు. సాయినగర్ వాసులు అమెకు పూలమాలలతో అపూర్వస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తున్న శ్రీధర్‌రెడ్డిని ఆశ్వీరదించాలని కోరింది. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు కొత్తచెరువులో రోడ్ షో

పుట్టపర్తి టౌన్: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్ షోతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ప్రముఖ సింగర్ నిర్మల హాజరవుతారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న శ్రీరంగరాజుపల్లి యువకులు

పరిగి: మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన 15 కుటుంబాలు టీడీపీతో పాటు వివిధ పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం కొడిగెనహళ్లిలో పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ లక్ష్మీరెడ్డి, రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నాగభూషణరెడ్డి, రామాంజినేయులు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నేతల ఒంటెద్దు పోకడలను భరించలేకనే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్



పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న ఆర్ఓ వెంకటశివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండోరోజు బుధవారం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా ముగిసింది. రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శ్రీనివాస్ పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ధర్మవరం నియోజకవర్గంలో 454, సత్యసాయి జిల్లాలోని మిగిలిన 5 నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్లు 14, ఇతర జిల్లాలకు సంబంధించి 83 మంది పోస్టల్ బ్యాలెట్లు సద్వినియోగం చేసుకున్నారని రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు.

19 మి.మీ వర్షపాతం నమోదు

అమరాపురం: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన ఓ మోస్తారు వర్షానికి వాతావరణం చల్లబడింది. 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రైతులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడక వక్క, తమలపాకు తోటల రైతులు ఇబ్బందులు పడేవారు. వాన పడటంతో వారికి కొంతమేర ఉపశమనం కలిగింది.

అబద్ధాలకు కేరాఫ్ చంద్రబాబు

- ఆయనవన్నీ తప్పుడు హామీలే
- ప్రజలెవరూ నమ్మొద్దని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



పాలసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా పాలన అందించారు. 'పేదలకు మరింత మంచి జరగాలంటే జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలి' అని మంత్రి, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో ఆమె బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌ని ఓడించడానికి బీజేపీ, టీడీపీ, జనసేన అనైతిక పొత్తు పెట్టుకున్నాయని విమర్శించారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజకీయ లబ్ధికోసం ఆచారణ సాధ్యం కాని హామీలు గుప్పించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి మోసపూరిత, ఆచారణ సాధ్యంకాని హామీలను ఇస్తున్నారన్నారు. వాటిని ప్రజలు నమ్మొద్దని, ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలు ధర్మానికి.. అధర్మానికి, పేదల పక్షపతికి, పెత్తందారుల పక్షానికి జరుగుతున్నాయన్నారు. ప్రజలందరూ ధర్మం వైపు నిలబడి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. చంద్రబాబు నాయుడుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలంటే ద్వేషమని, ఆయా వార్గల ఓట్లను మాత్రమే దండుకొని రాజ్యాధికం పొందడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. అయితే సీఎం జగన్ అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన మహనీయుడన్నారు. చంద్రబాబు అబద్ధాలకు కేరాఫ్ అని, పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితమ్మ అబద్ధాలకు డబుల్ కేరఫ్ అన్నారు. సవిత జీవితం మొత్తం నేరపూరితమైందని విమర్శించారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల ,మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్‌సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, స్థానిక సర్పంచ్ చిన్నగంగప్ప, స్థానిక నాయకులు గోవిదంరెడ్డి, సామలపల్లి రాము, ప్రదీప్‌రెడ్డి, మాజి సర్పంచ్ ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు జగనన్న అండ

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: పేదల ప్రతి కష్టంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండు కూడలి వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి, వయస్సు పైబడ్డ ప్రతి అవ్వతాతకు రూ.3 వేల పింఛన్ తంచన్‌గా మీ ఇంటికి అందిస్తున్నారన్నారు. అమ్మఒడి నగదుపాటు గోరుముద్ద, రాగిజావ, నాడు–నేడుతో పాఠశాలల ఆధునికీకరణ, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన, ఇంగ్లిష్ మీడియంతోపాటు ఐబీ చదువుతో విద్యారంగానికి పెద్దపీట వేశారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశారన్నారు. తాజాగా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు డబ్బు విడుదల చేయడాన్ని బాబు ఈసీ ద్వారా అడ్డుకున్నారని ఆరోపించారు.

తక్కు తాత..'పల్లె'ను నిలదీయండి

2014 ఎన్నికల్లో డ్వాక్రా, పంట, బంగారు రుణాలు మాఫీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ప్రకటించారని, గెలిచిన తర్వాత చేతులెత్తేశారని, తక్కు తాత పల్లెను నిలదీయాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల హామీలు అమలు చేయలేని పల్లె ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారా ప్రజలే ప్రశ్నించాలని సూచించారు. చెప్పుకోవడానికి ఒక్క మంచి పని చేయని పల్లె తాత కోడలు సింధూరా రెడ్డిని బరిలో దించి ఓట్లు అడుగుతున్నాడన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రముఖ గాయని నిర్మలా రాథోడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎస్టీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ డుంగావత్ రమేష్ నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షామీర్ భాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్దన్ రెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, యూత్ కన్వీనర్ హరినాథరెడ్డి ,టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు, రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం వెంకటగిరిపాళ్యం, మక్కాజిపల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ప్రభుత్వానికే మద్దతు తెలపాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రానాయక్, జనార్ధన్‌నాయక్, మల్లికార్జునరెడ్డి, పురుషోత్తంరెడ్డి, నారాయణ స్వామి, దుర్గప్ప, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ రోడ్‌షో

గోరంట్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ గురువారం గోరంటలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో పార్టీ ముఖ్యనాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

24 గంటల ముందే ప్రచారం ఆపాలి

పెనకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల పోలింగ్ 13వ తేదీకి 24 గంటల ముందే ప్రచారం ఆపాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయానికి లోబడి రాజకీయ పార్టీలు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

జేవీవీ పీపుల్స్ మేనిఫెస్టో విడుదల

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సీతారామయ్య జూనియర్ కళాశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషులు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవహారాలను మతం నుంచి వేరు చేయాలని, శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించేలా రాబోయే ప్రభుత్వాలు ఉండాలన్నారు. నీటిని అరుదైన ప్రజల సంపదగా పరిగణిస్తూ జాతీయ నీటి విధానాన్ని రూపొందించాలని తెలిపారు. శుభ్రమైన తాగునీరు దేశంలోని అన్ని ఇళ్లకు సరఫరా చేయాలని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య, జేవీవీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నరేంద్రబాబు, లోకేష్, పర్వతయ్య, సురేష్, ఖలందర్, ప్రసాద్, నరేంద్ర, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయించి చూపును అందిస్తామని తెలిపారు. క్లబ్ కార్యదర్శి నాగభూషణ, క్యాంపు చైర్మన్ కృష్ణమూర్తి, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, రామకృష్ణ, రత్నశేఖర్‌రెడ్డి, సోలిగాళ్ల వెంకటేషులు, దాత పాలగిరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో బూటకం



పరిగిలో ప్రచారం చేస్తున్న శాంతమ్మ, మంత్రి ఉషశ్రీచరణ్ సోదరి జ్యోత్స్న

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

పరిగి: టీడీపీ అధినేత చంద్రబాబు అండ్‌కో విడుదల చేసిన మేనిఫెస్టో బూటకమని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ విమర్శించారు. 2014 ఎన్నికల్లో ఇదే కుటమి విడుదల చేసిన మేనిఫెస్టోను చెత్త బుట్టలో పడేసి కనీస హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. పరిగి మండల కేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి ఉషశ్రీచరణ్ సోదరి జ్యోత్స్న , సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలకు తీరని అన్యాయం చేశారని ఎంపీ అభ్యర్థి శాంతమ్మ విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన ఆయన ప్రభుత్వంలో ఏనాడైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేశారా? ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వంలో నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బీసీలు...నా మైనార్టీలు...నా అగ్ర వర్ణ నిరుపేదలంటూ వారి ఆర్థికాభివృద్ధితో పాటూ రాజ్యాధికారాన్ని కట్టుబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసిన జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, లింగమ్మ, వాల్మీకి బద్రీనాథ్, మండల మాజీ కన్వీనర్ జయరాం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పండి

సోమందేపల్లి: ఎన్నికల సమయంలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలకు మభ్యపెట్టడానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి మాగే చెరువు, చెన్నాపురం, రంగేపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సోదరి జ్యోత్స్న, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఎంపీటీసీ నాగప్ప, వైస్ సర్పంచ్ మమతా, స్థానిక నాయకులు బాబు, సోమశేఖర్, ఆవుల నరసింహమూర్తి, అంజి, నర్సింహులు, రాంమోహన్, నారాయణ బాలు, మారుతి, నాగరాజు, గంగాధర్, మల్లికార్జున, మురళి, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



బీదానిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పెనుకొండ పట్టణం వజ్రాల పేటలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ సుధాకరరెడ్డి తదితరులు

రొద్దం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బుధవారం మండలంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కంబాలపల్లి, శ్యాపురం, బీదానిపల్లి తదితర గ్రామాల్లో వారు ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని కౌన్సిలర్ సుధాకరరెడ్డి , కొండలరాయుడు తదితరులు బుధవారం వజ్రాలపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్‌ను ప్రజలకు చూపిస్తూ ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు ఫరీద్, ఇర్షాద్, ఇస్మాయిల్‌సాబ్ తదితరులు దర్గాపేటలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరారు.